448) శ్రీ

ప|| నీమహిమో నాలోన నిండిన వలపు జాడో | యేమి సేతు నన్నెప్పుడు నెడయకుమయ్యా ||

చ|| యెనసి నీతో నేను యెంత వడి మాటాడినా | తనియదు నా మనసు తమి యెట్టిదో |
వినయముతో రెప్పలు వేయక చూచినాను | నినుపులై మమతలు నిచ్చ కొత్తలు ||

చ|| చలపట్టి నీ తోను సారె సారె బెనగిన | నలయదు నా మేను ఆశ యెట్టిదో |
కొలువులో నీ వద్ద గూచుండి యెంత నవ్విన | తలపులో కోరికలు తరగని ధాన్యాలు ||

చ|| కరగి యందాకా నిన్ను గాగిలించుకుండినాను | విడువవు చేతులు వేడుకెట్టిదో |
అడరి శ్రీ వేంకటేశ యలమేల్ మంగను నేను | తొడరి యేలితివి రతులు తరితీపులు ||